మినీకథ

# నష్టం

సాక్షి ఆనందరావు



"నేను పుట్టిన మరుక్షణమే మా ఇంట్లో దారిద్ర్యం పుట్టిందటండీ."

"అనెవరన్నారు?"

"మా నాన్న".

"ఆఁ ఏదో కోపంలో అనుంటాడు."

"ఆ కోపమయినా నేను పుట్టాననే పుట్టిందటండీ."

"బిడ్డల్ని సన్మార్గంలో పెట్టడానికి తండ్రి ఆ మాత్రం కోపం నటించాలి. అది కోప మనుకోకు."

"లేదండి. నేను పుట్టకముందు చాలా మంచిగా ఉండేవారటండి. నేను పుట్టాకనే వ్యసనాలకి బానిసైపోయాడట."

"మీ నాన్ననాన్నడా?"

"ఉహూఁ నన్ను కొట్టేముందు అమ్మ ఈ మాటే అంటుంది."

"మీ అమ్మ నిన్ను కొడుతుందా?"

"ఆకలేస్తుందని అడిగినా. కారణం లేకుండా కొట్టిందని అలిగినా కొడుతుంది."

"మీ ఇంట్లో సరిగా చూడరా నిన్ను?"

"నాకు పాలు పట్టడం మా అమ్మకిష్ట ముండేది కాదటండీ. ఒకసారిలాగే పాల కోసం ఏడుస్తుంటే నేలకేసి కొడతానని నాన్న నన్ను పైకెత్తేశాడట."

"నీ కెవరు చెప్పారు?"

"తమ్ముడికి గోరుముద్దలు తినిపించేటపుడు, కథ చెప్పమని మారాం చేసినపుడు అమ్మ చెపుతూ వుండేది."

"నీకు తమ్ముడున్నాడా?"

"వాడు పుట్టాకే దారిద్ర్యం తొలగిపోయిందట. కాస్త మనశ్శాంతిగావుందట."

"మీ తమ్ముడన్నాడా?"

"పడుకునే ముందు నాన్నంటాడు."

"మరి మీ అమ్మేమంటుంది?"

"నేను లేకపోతే అసలు బెంగే ఉండదట. కంటినిండా నిద్రపోవచ్చట."

"అరె! కన్న తల్లి దండ్రులకే బిడ్డల మీద ఇంత ద్వేషమా? నవ మాసాలు మోసిన కన్నతల్లి కూడా నీమీద జాలి దయలేదన్నమాట."

"అన్నం చాల్లేదని అడిగితే, 'చాల్లె! నిన్ను మేపడం ఇప్పటికే ఓ దండగ! సరి పెట్టుకో' అంటుంది.

"అయ్యో పాపం! ఇంత బాధపెడుతుంటే ఎలా ఉంటున్నావా ఇంట్లో? ఏడుపు రావడం లేదూ?"

"రాదండీ. నిద్రాభంగం కలుగుతుందని, అర్ధరాత్రి అపరాత్ర తనకుండా ఏడిస్తే దారిద్ర్యానికి తోడు మరిన్ని అరిష్టాలు చుట్టుకుంటాయని నాకు నల్లమందువేసి నిద్రపుచ్చేవారు."

"నల్ల మందా?"

"ఔనండి."

"ఇపుడూ వేసుకుంటావా?"

"పడుకొనే ముందు."

"తప్పు. నల్లమందు వేసుకోకూడదు. చచ్చిపోతావ్."

"నువ్వెందుకు చస్తావ్! మమ్మల్నందరినీ చంపిగాని నువ్వుచావ్వు. అంటుంది అమ్మ."

"అంత క్రూరంగా మాట్లాడుతుందా?.. చదువుకున్నావా?"

"చదివించలేదు. తమ్ముడిచేత ఒక్కో మాట పదేసిసార్లు బట్టీ పట్టించేది అమ్మ. వాడికంటే ముందు నేనే నేర్చుకున్నాను."

"కొడుకుమీద అంత ప్రేమా మీ అమ్మా నాన్నలకి?"

"వాడి ప్రస్తావన వచ్చినపుడల్లా 'నా ఆశలన్నీ వాడిమీదే వున్నాయి' అంటాడు నాన్న"

"మీ రిదరూ ఒకే తల్లి బిడ్డలుగదా! మీ తమ్ముణ్ణి ప్రేమించడమేంటి? నిన్ను ద్వేషించడమేంటి?"

"వాడు లాభం. నేను నష్టం గనుక."

"నష్టమా? అంటే?"

"ఆడపిల్ల".